పల్లెల్లో సర్వే సందడి..


రఘునాథపాలెం పంచాయతీ పరిధిలో సర్వే చేస్తున్న సిబ్బంది

- మురుగుకు స్వస్తి పలికేలా పారిశుద్ధ్య వ్యవస్థ
- రూ.110 కోట్ల అంచనాతో అండర్ డ్రెయిన్ నిర్మాణాలు
- గ్రామాల వారీగా కొనసాగుతున్న సర్వే
- ఆదర్శ మండలంగా తీర్చిదిద్దేందుకు అడుగులు

రఘునాథపాలెం: పారిశుద్ధ్య పరిరక్షణలో ఆదర్శంగా నిలిచేలా రఘునాథపాలెం మండలం దూసుకెళ్లేందుకు సన్నద్ధమవుతోంది. మురికివాడలు లేని గ్రామాలుగా మండలంలోని 37 గ్రామ పంచాయతీలను తీర్చిదిద్దే లక్ష్యంతో కేంద్రప్రభుత్వం సెంట్రల్ శానిటేషన్ ఫండ్ ద్వారా అండర్ డ్రెయిన్ నిర్మాణం చేపట్టేందుకు ప్రణాళిక సిద్ధం చేసింది. దీంతో సుమారు రూ.110 కోట్ల అంచనాతో అండర్ డ్రెయిన్ వ్యవస్థ ఏర్పాటుకు మండల పరిధిలో సర్వే ప్రక్రియ వేగంగా కొనసాగుతోంది. దీని ద్వారా మురుగు నీటిని సమీప చెరువుల వద్దకు చేర్చేలా ఆధునిక పనులు జరగనున్నాయి. ఆ నీటిని అక్కడే శుద్ధి చేసి చెరువుల్లో వ్యవసాయ అవసరాలకు వినియోగించేలా నిర్మాణం చేపట్టనున్నట్లు సమాచారం.

గ్రామాలవారీగా సర్వే..

ప్రైవేట్ ఏజెన్సీ ద్వారా రెండు ప్రత్యేక టీమ్‌లు సర్వే పనుల్లో నిమగ్నమై ఉన్నాయి. ఒక్కో టీమ్‌లో ఐదారు మంది నిపుణులు ఉండగా.. ఇప్పటికే 10 గ్రామపంచాయతీల్లో సర్వే పూర్తిచేశారు. మిగిలిన పంచాయతీల్లో పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యాన సర్వే ప్రక్రియ కొనసాగుతుండగా.. సర్వే పూర్తయ్యాక డీపీఆర్(డీటైల్ ప్రాజెక్ట్ రిపోర్ట్), సమగ్రమైన అంచనా నివేదికలు (రిటైల్ ఎస్టిమేట్లు) తయారు చేసి గ్రామాల వారీగా పనుల ప్రతిపాదనలు సిద్ధం చేయనున్నారు.

స్థానిక ప్రజల్లో ఉత్సాహం..

మురుగు నీటి సమస్యలు, దుర్వాసనలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న గ్రామాల్లో ఈ అండర్ డ్రెయిన్ ప్రాజెక్ట్ ద్వారా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ప్రాజెక్ట్ పూర్తయితే గ్రామాల రూపురేఖలు మారి, పర్యావరణ పరిరక్షణలో కొత్త అధ్యాయం రాయబడనుంది.

మంత్రి తుమ్మల హామీతో..

నిధుల మంజూరుకు సంబంధించి రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇప్పటికే సంబంధిత కేంద్ర మంత్రిని కలిసి ప్రాథమిక హామీ పొందినట్లు సమాచారం. ఆ హామీ మేరకే రఘునాథపాలెం మండలంలో సర్వే ప్రక్రియకు శ్రీకారం చుట్టినట్లు తెలిసింది. నిధులు మంజూరై అండర్ డ్రెయిన్ నిర్మాణ పనులు పూర్తయిన పక్షంలో జిల్లాలోనే తొలి 100 శాతం పారిశుద్ధ్య పరిరక్షణ మండలంగా నిలిచే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు.


డ్రెయిన్ నిర్మాణంలో లెవల్స్ నమోదు చేస్తున్న సర్వే ఏజెన్సీ సిబ్బంది

ప్లాస్టిక్ రహిత నగరంగా తీర్చిదిద్దాలి


జ్యూట్ బ్యాగులు పంపిణీ చేస్తున్న మేయర్ నీరజ

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మాన్ని ప్లాస్టిక్ రహిత నగరంగా తీర్చిదిద్దాలని మేయర్ పునుకొల్లు నీరజ అన్నారు. బుధవారం మేయర్ తన చాంబర్‌లో శానిటరీ జవాన్లు, ఇన్‌స్పెక్టర్లకు జ్యూట్ బ్యాగులను పంపిణీ చేసిన సందర్భంగా ఆమె మాట్లాడారు. డివిజన్‌లలో విధులు నిర్వర్తించే జవాన్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ప్లాస్టిక్ సంచుల వినియోగం వలన జరిగే అనర్థాలను ప్రజలకు వివరించాలన్నారు. దుకాణాలకు వస్తువులు, సరుకులు, కూరగాయలు తెచ్చుకునేందుకు వెళ్లే వారు తమతో పాటు ఇంటి నుండే జ్యూట్ బ్యాగ్‌లు, డబ్బాలను వెంట తీసుకొని వెళ్లాలని సూచించారు. భవిష్యత్ తరాల కోసం ప్రకృతిని సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ కె.శ్రీనివాస్, అసిస్టెంట్ కమిషనర్ జె.అనిల్‌కుమార్, శానిటరీ సూపర్‌వైజర్ ఎం.సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

మతోన్మాద రాజకీయాలను తిప్పికొట్టండి



మాట్లాడుతున్న షేక్ బషీరుద్దీన్

తిరుమలాయపాలెం: మతోన్మాద రాజకీయాలు తిప్పికొట్టేలా యువత ఉద్యమాలకు రావాలని, రాజకీయాలు చేయాలని భారత ప్రజాతంత్ర యోజన సమైక్య(డీవైఎఫ్ఐ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ బషీరుద్దీన్ పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని పిండిప్రోలులో డీవైఎఫ్ఐ పాలేరు డివిజన్ 13వ మహాసభలో ఆయన మాట్లాడారు. ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం యువతను తప్పుదారి పట్టిస్తూ మతోన్మాద రాజకీయాలను నడిపిస్తోందని ఆరోపించారు. దీన్ని తిప్పికొట్టేందుకు యువత చైతన్యం కావాలని, అన్నదమ్ములుగా కలిసిమెలిసి లౌకికత్వంతో మెలగాలని పిలుపునిచ్చారు. యువతకు ఉద్యోగావకాశాలు ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చింతల రమేష్, బొడ్డు మధు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు పోనుకుల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కలిసొచ్చే పార్టీలతో కలిసి పోటీ చేస్తాం

కామేపల్లి: స్థానిక ఎన్నికల్లో టీడీపీతో కలిసొచ్చే పార్టీలతో అన్ని స్థానాల్లో పోటీ చేస్తామని టీడీపీ మండల అధ్యక్షుడు పుచ్చకాయల సత్యనారాయణ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో సమావేశం నిర్వహించగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో అజ్మీరా హరినాయక్, ఎల్లంకి నవీన్, దుద్దుకూరి వెంకట్, బానోత్ దేవేందర్, కొమ్మిన్ని సత్యనారాయణ, మాధవ్‌రావు, రంగారావు తదితరులు పాల్గొన్నారు.

యూసీసీఆర్(ఎంఎల్) పార్టీలో చేరిక

కామేపల్లి: మండలంలోని మద్దులపల్లి గ్రామంలో భారత కమ్యూనిస్టు విప్లవకారుల సమైక్యతా కేంద్రం(మార్క్సిస్టు-లెనినిస్ట్) పార్టీలో వివిధ పార్టీలకు చెందిన పలువురు చేరారు. పేదల కోసం పని చేస్తూ, పార్టీ విధానాలు నచ్చి పార్టీలో చేరినట్లు పార్టీ నేతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓపీడీఆర్ జిల్లా సహాయ కార్యదర్శి చిప్పలపల్లి వీరన్న, పోలెబోయిన రవి, ఇమ్మడి గోపాలకృష్ణ, బండ్ల వెంకన్న, పడిగ రమేశ్, రెడబోతు శ్రీనివాసరెడ్డి, బుర్ర లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం నేతలతో చంద్రబాబు భేటీ

ఖమ్మంఅర్బన్: రాష్ట్రంలోని పలు ప్రాంతాల టీడీపీ నాయకులతో పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు భేటీ అయ్యారు. ఈ సమావేశంలో జిల్లా నుంచి డాక్టర్ వాసిరెడ్డి రామనాథం, కూరపాటి వెంకటేశ్వర్లు, వనమా వాసు తదితరులు పాల్గొన్నారు. ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడుతూనే పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని నాయకులకు చంద్రబాబు సూచించారు.

ఉపాధ్యాయురాలి డిప్యూటేషన్ రద్దు చేయాలి

రఘునాథపాలెం: రఘునాథపాలెం మండలం గణేశ్వరం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు ఎండీ మజార్ డిప్యూటేషన్ రద్దు చేయాలని గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు గత సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. 2018 నుంచి ఆ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తున్న మజార్ రాకతో పాఠశాలలో బోధనా ప్రమాణాలు మెరుగుపడ్డాయని తల్లిదండ్రులు తెలిపారు. బదిలీని రద్దు చేయకపోతే నేడు(గురువారం) నుంచి పాఠశాలను మూసివేసి బంద్ చేపడతామని హెచ్చరించారు.

స్థానిక ఎన్నికల్లో పార్టీ గెలుపే ధ్యేయం


సమావేశంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే హరిప్రియానాయక్, నాయకులు

కామేపల్లి: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపే ధ్యేయంగా పని చేయాలని ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియా నాయక్ అన్నారు. బుధవారం కొత్తలింగాలలో నిర్వహించిన విస్తృత స్థాయి సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎన్నికల్లో మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ హామీలు నెరవేర్చక ప్రజలకు బాకీపడ్డ గ్యారంటీలను గ్యారంటీ కార్డు రూపంలో ప్రతి ఒక్క ఓటరుకు చేరేలా చూడాలన్నారు. కాంగ్రెస్ వైఫల్యాలను తెలియజేస్తూ బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపునకు కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎన్నికల్లో పోటీ చేసే ఆశావహుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆంతోటి అచ్చయ్య, మల్లెంపాటి శ్రీనివాసరావు, తీర్థాల చిదంబరరావు, సామా మోహన్‌రెడ్డి, మూడ్ కృష్ణప్రసాద్‌నాయక్, వడియాల కృష్ణారెడ్డి, పుచ్చకాయల బాబు, కీసర విష్ణువర్ధన్‌రెడ్డి, నున్నావత్ సూర్య, భట్టు శంకర్, ఆదూరి ప్రసాద్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఫుట్‌బాల్ జట్టుకు ఎంపిక


షేక్ నసీమా

ఖమ్మంఅర్బన్: సంగారెడ్డి జిల్లాలో ఈనెల 10 నుంచి మూడురోజుల పాటు జరిగే రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొనే బాలికల జిల్లా జట్టుకు మల్లెమడుగు గ్రామానికి చెందిన విద్యార్థిని షేక్ నసీమా ఎంపికైంది. స్థానిక పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న ఆమె గతేడాది కూడా ఎస్‌జీఎఫ్ అండర్-17 రాష్ట్ర స్థాయి బాలికల ఫుట్‌బాల్ పోటీల్లో ఉమ్మడి జిల్లా జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించింది. ఈ సందర్భంగా నసీమాను ఎంఈఓ శైలజాలక్ష్మి, పాఠశాల హెచ్‌ఎం కె.సాంబమూర్తి, పీడీ బియ్యని కృష్ణయ్య, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ అధ్యక్షురాలు అలివేలు, కార్పొరేటర్లు లలితారాణి, నిరంజన్ తదితరులు బుధవారం అభినందించారు.

కబడ్డీ జట్టుకు సాయికృష్ణ..


సాయికృష్ణను అభినందిస్తున్న ఆర్‌సీఓ, ప్రిన్సిపాల్

కూసుమంచి: కూసుమంచి మహాత్మాజ్యోతి పూలే గురుకుల పాఠశాల పదో తరగతి విద్యార్థి ఎన్.సాయికృష్ణ అండర్-19 విభాగంలో రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొనే జిల్లా జట్టుకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా విద్యార్థిని బీసీ గురుకులాల ఆర్‌సీఓ రాంబాబు, ప్రిన్సిపాల్ మల్లయ్య, పీఈటీ నర్సింహ, ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రయాణికురాలికి తప్పిన ప్రమాదం

నేలకొండపల్లి: ఆర్టీసీ బస్సు ఎక్కే సమయాన ఓ ప్రయాణికురాలికి ప్రమాదం తప్పింది. వివరాలిలా.. నేలకొండపల్లి నుంచి ఖమ్మం వెళ్తున్న ఆర్టీసీ బస్సును బుధవారం ఓ ప్రయాణికురాలు ఎక్కేందుకు ప్రయత్నించింది. ఈ సమయాన బస్సు డ్రైవర్ ఒక్కసారిగా ముందుకు పోనివ్వడంతో ఆమె చేతికి గాయమైంది.

ఆటో బోల్తా..

- ముగ్గురు విద్యార్థులకు గాయాలు

ఖమ్మంఅర్బన్: నగరంలోని 10వ డివిజన్ ఇందిరానగర్ ప్రధాన రోడ్డులో పాఠశాల విద్యార్థులతో వస్తున్న ఆటో బుధవారం పల్టీకొట్టగా ముగ్గురు విద్యార్థులకు గాయాలయ్యాయి. స్థానికులు, హెచ్‌ఎం కథనం ప్రకారం.. 7వ డివిజన్ టేకులపల్లి డబుల్ బెడ్రూమ్ నుంచి రోటరీనగర్‌లోని ప్రభుత్వ పాఠశాలకు ఆటోలో వస్తుండగా ఇందిరానగర్ రోడ్డులో ఎదురుగా వచ్చే ద్విచక్రవాహనం ఢీకొట్టగా ఆటో పల్టీ కొట్టింది. దీంతో ముగ్గురు విద్యార్థులకు గాయాలైనట్లు పాఠశాల హెచ్‌ఎం శ్రీలత తెలిపారు.

కేసు నమోదు

తిరుమలాయపాలెం: సూర్యాపేట జిల్లా నడిగూడెంకి చెందిన గుగులోత్ లాల్‌సింగ్ తన 28 ఏళ్ల కుమారుడు గుగులోత్ నాగ అదృశ్యంపై బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. నాగ గత 45 రోజులుగా మండలంలోని పైనంపల్లి శివారు హాల్‌తండాలో మేనత్త వాంగుడోత్ విజయ ఇంటి వద్ద ఉంటున్నారు. ఈ క్రమంలో గత నెల 30న పైనంపల్లి నుంచి ఖమ్మం వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో కుటుంబసభ్యులు ఎక్కడ వెతికినా ఫలితం లేకపోవడం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి, సంక్షేమం..


పార్టీలో చేరిన వారితో మంత్రి తుమ్మల, తదితరులు

ఖమ్మంఅర్బన్: రఘునాథపాలెం మండలానికి కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి, సంక్షేమం అందిస్తామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. బుధవారం స్థానిక ఎన్నికల నేపథ్యాన మండలంలోని రఘునాథపాలెంలో బీఆర్ఎస్ పార్టీ నుంచి 85 కుటుంబాలు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్న సందర్భంగా ఆయన మాట్లాడారు. పార్టీలో చేరిన వారికి మంత్రి తుమ్మల, దుర్గాప్రసాద్‌లు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. మండలంలో ప్రభుత్వ మెడికల్ కాలేజ్, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్, స్వామి నారాయణ గురుకుల పాఠశాల వంటి విద్యా సంస్థల ఏర్పాటు, నీటి వసతులు, ఉద్యాన పంటలు, ఆయిల్ పామ్ సాగు ద్వారా రైతుల సంక్షేమం, పేదలకు ఇందిరమ్మ ఇళ్లు, రేషన్, సన్నబియ్యం పథకాలు అందించడం ద్వారా బలహీన వర్గాలకు కాంగ్రెస్ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ నీరజ, సాదు రమేశ్ రెడ్డి, గుత్తా వెంకటేశ్వరరావు, కమర్తపు మురళి, పాలెపు వెంకటరమణ, ఆత్మచైర్మన్ దిరిశాల వెంకటేశ్వర్లు, మార్కెట్ చైర్మన్ యరగర్ల హన్మంతరావు, సొసైటీ అధ్యక్షుడు తాత రఘురాం, మండల పార్టీ అధ్యక్షుడు వాంకుడోత్ దీప్లానాయక్, గాజుల కృష్ణరావు, గుడిపూడి రామారావు, దేవ్‌సింగ్, రెంటాల ప్రసాద్, బోయన వెంకట నర్సయ్య, అల్లిక సీతయ్య, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలపై ఉద్యోగులకు శిక్షణ


రఘునాథపాలెం: శిక్షణ ఇస్తున్న దృశ్యం

రఘునాథపాలెం/నేలకొండపల్లి: మండలాల్లో ఎన్నికల నిర్వహణను నిబంధనలకు అనుగుణంగా జరిగేలా బుధవారం రఘునాథపాలెం, నేలకొండపల్లిలో పోలింగ్ అధికారులకు(పీఓ) ఒకరోజు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈనేపథ్యాన రఘునాథపాలెం రైతువేదికలో పోలింగ్ కేంద్రాల్లో నామినేషన్ల ప్రక్రియ, ఎన్నికల నియమావళి, ఇతర కీలక నిబంధనలపై పోలింగ్ అధికారులకు ట్రైనర్ శేషు అవగాహన కల్పించగా.. నేలకొండపల్లిలో రిసోర్స్ పర్సన్ పెద్ది జగన్నాథం పీఓ, ఏపీఓ బాధ్యతలు, విధులను వివరించారు. ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా, సురక్షితంగా నిర్వహించాలని సూచించారు. రఘునాథపాలెంలో జరిగిన శిక్షణ మండల ప్రత్యేక అధికారి, జిల్లా మైనార్టీ అధికారి ముజాహిద్, ఎంపీడీఓ అశోక్‌కుమార్, ఎంపీఓ శ్రీనివాసరెడ్డి, ఎంఈఓ రాముల పర్యవేక్షణలో కొనసాగింది. అలాగే నేలకొండపల్లిలో ఎంపీడీఓ ఎం.యర్రయ్య, మండల స్పెషల్ ఆఫీసర్ కె.రవిబాబు, మండల పంచాయతీ అధికారి సీహెచ్.శివ, పీఓ, ఏపీఓలు పాల్గొన్నారు.

నామినేషన్ల స్వీకరణకు సర్వం సిద్ధం

నేలకొండపల్లి: మండల ప్రాదేశిక నియోజకవర్గం, జెడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంపీడీఓ ఎం.యర్రయ్య తెలిపారు. బుధవారం ఆయన చాంబర్‌లో మాట్లాడుతూ.. 18 ఎంపీటీసీలకు గాను 6 క్లస్టర్లు, జెడ్పీటీసీ మరో ప్రత్యేక క్లస్టర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నేలకొండపల్లి క్లస్టర్-1లో నేలకొండపల్లి - ఎంపీటీసీ 1, 2, 3 స్థానాలకు మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో నామినేషన్లు స్వీకరించనున్నట్లు తెలిపారు. గువ్వలగూడెం, నాచేపల్లి, ముజ్జుగూడెం ఎంపీటీసీ స్థానాలకు ఎంపీడీఓ క్లస్టర్లలో ఏర్పాటు చేశామన్నారు. పైనంపల్లి, బైరవునిపల్లి, మంగాపురంతండా ఎంపీటీసీలకు ఎంపీడీఓ క్లస్టర్లు, చెరువుమాధారం, రాయగూడెం, అప్పలనరసింహాపురం ఎంపీటీసీ స్థానాలకు స్త్రీశక్తి భవన్ క్లస్టర్-1లో, మోటాపురం, రాజేశ్వరపురం, కోరట్లగూడెం ఎంపీటీసీ స్థానాలకు స్త్రీశక్తి భవన్ క్లస్టర్-2లో నామినేషన్ అందించాలని కోరారు. అలాగే జెడ్పీటీసీ, ఎంపీడీఓ కార్యాలయం 7వ క్లస్టర్‌లో నామినేషన్లు స్వీకరించనున్నట్లు తెలిపారు. ప్రతీ క్లస్టర్‌కు రిటర్నింగ్ అధికారి, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, ఒక కంప్యూటర్ ఆపరేటర్ నియమించామన్నారు. నామినేషన్ల ప్రక్రియకు అందరూ సహకరించాలని కోరారు.

నేడు విద్యుత్ అంతరాయం

ఖమ్మంవ్యవసాయం: నగరంలోని టౌన్-5 పరిధిలోని రామాలయం 33 కేవీ ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని టౌన్-1 ఏడీఈ నాగార్జున బుధవారం తెలిపారు. దీంతో కమాన్‌బజార్, కస్బాబజార్, వల్లాల వారి వీధి, షాదీఖానా, స్టేషన్ రోడ్, బొమ్మ సెంటర్, శాంతి లాడ్జ్ ఏరియా, వినోద థియేటర్ ఏరియా, పాత మున్సిపాలిటీ, ఖిలా, శుక్రవారపు పేట, బ్రాహ్మణబజార్, చర్చి కాంపౌండ్, రామకృష్ణ నగర్, మేదర బజార్, అమ్మ భవాని టెంపుల్ ఏరియా తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు. అలాగే ఖమ్మం టౌన్-2 సెక్షన్ పరిధిలోని 11 కేవీ మామిళ్లగూడెం పరిధిలో నిర్వహణ పనుల కారణంగా గురువారం ఉదయం 9 నుంచి 10 గంటల వరకు, 11 కేవీ బస్ డిపో రోడ్ ఫీడర్ అండ్ 11 కేవీ మైక్రోవేవ్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 12 నుంచి 1 గంట వరకు మామిళ్లగూడెం, బస్ డిపో రోడ్, మయూరిసెంటర్, వడ్డెర కాలనీ, ఆంజనేయ స్వామి గుడి రోడ్ ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని ఏడీఈ కోరారు.

బకాయిలు చెల్లించాలి


సమావేశంలో మాట్లాడుతున్న జయరాం

ఖమ్మం మామిళ్లగూడెం: దాదాపు 40 ఏళ్లుగా ప్రభుత్వ ఉద్యోగం చేసి అన్ని వర్గాల ప్రజలకు సహకారం అందించిన తమకు ఉద్యోగ విరమణ అనంతరం రావాల్సిన బకాయిలు నేటికి చెల్లించకపోవడం దారుణమని రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. బుధవారం ఖమ్మంలో జరిగిన సమావేశంలో సంఘ ప్రతినిధులు మాట్లాడారు. రిటైర్డ్ అయి 18 నెలలు గడుస్తున్నా.. ఇప్పటి వరకు ఎటువంటి బకాయిలు చెల్లించకపోవడంతో ఇంటి నిర్వహణ, పిల్లల విద్య, ఆస్పత్రి ఖర్చులు తదితర సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. అప్పులు తీర్చలేక, వడ్డీలు కట్టలేక వారి వేధింపులు తట్టుకోలేక మనోవేదన గురవుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో అధ్యక్షుడు సింగారపు జయరాం, ప్రధాన కార్యదర్శి ముప్పల భారతి, రామారావు, లక్ష్మయ్య, నాగేందర్, రామకోటేశ్వరరావు, గోవిందరావు, కృష్ణారావు, అంబటి శాంతయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇందిరానగర్ బస్టాప్ తరలింపు


బస్టాప్ స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ఖమ్మంమయూరిసెంటర్/ ఖమ్మంఅర్బన్: నగరంలోని ఇందిరానగర్ పర్ణశాల వద్ద ఆర్టీసీ బస్టాప్‌ను ఏర్పాటు చేయాలని ఆర్టీసీ అధికారులు నిర్ణయించారు. ప్రస్తుతం ఇందిరానగర్‌లో మమతా రోడ్డు సర్కిల్ వద్ద గల ట్రాఫిక్ సిగ్నల్ పాయింట్‌లో బస్టాప్ కొనసాగుతుండగా.. దీనిని కొంచెం ముందుకు మార్చేందుకు ట్రాఫిక్ పోలీసులు, ఆర్టీసీ అధికారులు బుధవారం పరిశీలన చేశారు. ప్రస్తుత బస్టాప్ వద్ద ట్రాఫిక్ సమస్యలు తలెత్తడంతో ఆర్ఎం సరిరామ్ సూచనలతో డిప్యూటీ ఆర్ఎం మల్లయ్య, ఖమ్మం డిపో మేనేజర్ శివ ప్రసాద్‌లు ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసుతో కలిసి పర్ణశాల వద్ద ప్రాంగణం ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించారు. ఇది గురువారం నుండే అమలవుతుందని అధికారులు వెల్లడించారు.


అటెన్షన్ ప్లీజ్

రోడ్డున పడ్డ పచ్చదనం!



రాష్ట్ర ప్రభుత్వం మొక్కల పెంపకాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుని వనమహోత్సవం కార్యక్రమం ప్రవేశపెట్టింది. దీనిలో భాగంగా నర్సరీలు, ప్రభుత్వ స్థలాల్లో మొక్కలు పెంచారు. అయితే ఏడాది పాటు ఎంతో కష్టపడి పెంచిన మొక్కలను నాటకుండా బస్వాపురం-వందనం గ్రీన్‌ఫీల్డ్ హైవే రోడ్డు పక్కన ఇలా నిర్లక్ష్యంగా వదిలేయడంతో నిరుపయోగంగా మారాయి. ఇందులో కొన్ని మొక్కలు ఎండిపోయాయి. ఈమాత్రం దానికి మొక్కలు పెంచడం అవసరమా అని ప్రజలు ప్రశ్నిస్తూ.. ఇకనైనా అధికారులు మొక్కల సంరక్షణపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్

క్లుప్తంగా

విద్యార్థుల ఆరోగ్య భద్రతకు ప్రాధాన్యత

ఖమ్మం మామిళ్లగూడెం: హాస్టళ్లలో పరిశుభ్రత ప్రమాణాలను క్రమం తప్పకుండా పాటిస్తూ విద్యార్థుల ఆరోగ్య భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కళావతిబాయి అన్నారు. బుధవారం ఖమ్మంలోని డాక్టర్ అంబేద్కర్ కళాశాలతో పాటు ఎస్సీ, ఎస్టీ హాస్టళ్లను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా హాస్టల్ వంటశాల, ఆహార నిల్వ గదులు, భోజనశాల, వసతి గృహాలను సమగ్రంగా పరిశీలించారు. వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల శుభ్రత, పోషకాహార ప్రాముఖ్యత, స్వచ్ఛమైన నీరు తాగడం, వ్యర్థాల సరైన నిర్వహణ, చెత్త నిల్వలు నివారించడం వంటి అంశాలపై హాస్టల్ వార్డెన్లకు, వంటశాల సిబ్బందికి ఆమె వివరించారు.

అయ్యప్ప దీక్షలు ప్రారంభం

ఖమ్మంఅర్బన్: ఖమ్మం 4వ డివిజన్ యూపీహెచ్ కాలనీలోని శ్రీ అభయ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో బుధవారం నుంచి అయ్యప్ప దీక్ష(మాలధారణ)లు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పలువురు భక్తులు మాల ధరించారు. మాలధారులకు 41 రోజుల పాటు అన్నప్రసాదం ఉచితంగా సమకూర్చనున్నట్లు ఆలయ కమిటీ బాధ్యులు వెల్లడించారు.

గరుడోత్సవం..


శ్రీ వేంకటేశ్వరుని ఆలయంలో గరుడోత్సవం

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని కమాన్‌బజార్ స్తంభాద్రి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న 61వ వార్షిక కల్యాణోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి సంప్రదాయ పద్ధతిలో గరుడోత్సవాన్ని నిర్వహించారు. బిందె తీర్థం, రాజభోగం కార్యక్రమాలు నిర్వహించగా.. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి వేణుగోపాల చారి, ది ఐరన్ హార్డ్‌వేర్ అండ్ స్టీల్ మర్చంట్స్ అసోసియేషన్ ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు అభినందనలు


పల్లవిని అభినందిస్తున్న యాజమాన్యం

ఖమ్మంరూరల్: ప్రధాని మోదీ చేతులమీదుగా అవార్డు అందుకున్న మండలంలోని ఆరెంపులకు చెందిన తాళ్లూరి పల్లవిని బీబీఎం పాఠశాల యాజమాన్యం అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ కాంతారావు, కరస్పాండెంట్ నాగమణి మాట్లాడుతూ.. తమ పాఠశాలలో చదువుకున్న పల్లవి ఏఐఏపీలో ఆల్ ఇండియా టాపర్‌గా నిలిచి పలువురికి ఆదర్శంగా నిలవడం అభినందనీయమని, మున్ముందు జీవితంలో ఎదగాలని ఆకాంక్షించారు.

‘ఎస్‌బీఐటీ’లో కల్చరల్ డే

ఖమ్మం సహకారనగర్: నగరంలోని ఎస్‌బీఐటీ కళాశాలలో బుధవారం కల్చరల్ డే వేడుకలను నిర్వహించినట్లు ఎస్‌బీఐటీ కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన తెలుగు ఇండియన్ ఐడల్ కార్యక్రమంలో పోటీ పడుతున్న గాయకులు సంగీత ప్రదర్శన ఇచ్చిఆకట్టుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ జి.ధాత్రి, అకాడమిక్ డైరెక్టర్లు గుండాల ప్రవీణ్‌మార్, గంధం శ్రీనివాసరావు, ఏవీవీ శివప్రసాద్, రవీంద్రబాబు ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, ధీరజ్ బృందం, పవన్ కల్యాణ్, దర్శన్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థులపై ఆరా..

నేలకొండపల్లి: మండలంలోని స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన కాంగ్రెస్ అభ్యర్థుల కోసం అన్వేషణ మొదలైంది. ఇప్పటికే సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ అభ్యర్థులపై పార్టీ ఆధ్వర్యాన అభిప్రాయ సేకరణ పూర్తి చేశారు. దీంతో కమిటీ ఎంపిక చేసిన అభ్యర్థుల బలబలాలపై నిఘా వర్గాలు ఆరా తీస్తున్నారు. పార్టీలో వారికున్న అనుబంధం, సామాజిక, ఆర్థిక స్థితిగతులు, వ్యక్తిత్వం ఇతరత్రా అంశాలపై క్షేత్రస్థాయిలో సర్వే చేస్తున్నట్లు సమాచారం. వీరి నివేదిక ఆధారంగా గురువారం అభ్యర్థుల ప్రకటన చేయొచ్చని పార్టీ నాయకులు పేర్కొంటున్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	ఓజీ
వినోద	కాంతార
సాయిరాం	ఓజీ
ఆదిత్య	కాంతార, మిరాయ్
శ్రీనివాస	ఇడ్లీకొట్టు, మిరాయ్

- ఖమ్మంగాంధీచౌక్